# నిండుప్రాణం

శ్రీ నండూరి ఈశ్వరం

పొద్దస్తమానమూ ఏరిన పరిగెగంపలో వేసి నెత్తినబెట్టుకొని, డొంక మీది ఇరుకుదారిలో ఊరికి అభిముఖంగా నడుస్తోందిలక్ష్మి. సంఘమంతా దూరంగా తోలిన నీచకులంలో జన్మించినా సౌందర్యపు నిగ్గులు ఆమె మానవదేహంలోని దేవత్వాన్ని చిరునవ్వులతో నిరూపిస్తున్నాయి. సంస్కారహీనమైన కేశాలు గాలితాకుడుకు అల్లల్లాడుతూంటే ఆ చెట్లూ, పుట్టలూ, పొదలూ వీటన్నిటిమధ్యా అప్పుడే ఏ సెలయేటిలోనో స్నానంచేసి తడియార్చుకునే వనసుందరిలాగుంది. సాంధ్యరాగంలో కలసిపోయిన ఆమె యౌవన శరీరపు పసిడికాంతులు నీలాకాశపు టంచుల్లో తిరిగే ఒక మబ్బుతునకమీద ప్రతిఫలించినాయి.

... ... ...

ఆ త్రోవనే ఎదురుగావస్తున్నాడు బుఱ్ఱమీసాలమోతుబరి భూస్వామి అచ్చయ్య; గరుకుగా బండబారిన బుగ్గలమీదికి మీసాలను మెలివేసుకుంటూ. మొలనున్న వెండి తాడుకుకట్టిన తాళపుచెవుల గుత్తిరాపిడి పడలేక మెల్లిగా ఏడుస్తోంది.

డొంక పెద్దదే! దారి చిన్నది. అటూ యిటూ చెట్లూ, దుబ్బులూ ముళ్లకంచెలు! అచ్చయ్యను చూచి తొలగి పోయేందుకు వీలులేక అలానే నిలుచుంది లక్ష్మి.

అచ్చయ్య లక్ష్మివంక చూచాడు. ఎన్నాళ్లనుంచో ఆమె సౌందర్యాన్ని ఒక్కమారుగా త్రాగేయాలనుకున్న తన సంకల్పం నేటికి ఫలించిందనుకున్నాడు. నిర్జనప్రదేశంలో తనయెదుట నిలువబడిన లక్ష్మి చిరుగుల రవికెలోని వయసుపొంగులు అతన్ని ఆకర్షించినాయి. దగ్గరకు వెళ్లాడు.

“లక్ష్మి! ఎన్నాళ్లకు? ఇదిగో నామాట వింటే నీ ఒళ్లంతా బంగారంచేస్తా” అంటూ చేతులు చాచాడు.

బెదిరిన లేడిచూపులతో గజగజ వణికి పోయేదేహంతో

“బాబూ, తండ్రిలాంటోరు! అడ్డు తొలగండి” అన్నది.

ఉద్రేకంతో ఆమెను చేతుల్లోకి లాక్కున్నాడు అచ్చయ్య. మానరక్షణకోసం బలిష్టమైన అతనిచేతుల్లో పెనగులాడి పెనగులాడి సొమ్మసిల్లింది లక్ష్మి.

................

................

అర్ధరాత్రి, వెన్నెలచల్లదనంలో తెప్పరిల్లింది లక్ష్మి. దూరాన రెండుమూడు కాగడాలు కనుపిస్తున్నాయి. ఆ మసకవెన్నెల్లో తనశరీరమంతా తడుముకున్నది. ఏదో తెలి

యని బాధా ఆవేదనా గుండెల్లో మంటా బయలుదేరినాయి. అపరాధం చేసినదానిలా భయపడింది. అవమానంతో పరిభవంతో గుండె బ్రద్దలయ్యేటట్టున్నది. దగ్గిరలోనే భర్త కేక వినుపించింది.

"ఓరిసరిసిగా! రారా! ఈమద్దిల యెక్కడా లేదు. ఆడసూడాలి" అనేమాటలు.

అపవిత్రమైన ఈ దేహాన్ని అవమానంతో పాతాళానికి క్రుంగిపోయే ఈముఖాన్ని ఈ ప్రపంచంలోని మలినజీవులకూ స్వార్థపరులకూ చూపదలుచుకోలేదామె.

లేచి పరువెత్తింది. తిన్నగా డొంకదాటి మెరకపొలాలకి అడ్డంపడి మోటబావి చేరింది. ఆ అగాధజలాల్లో గభీలుమన్న మ్రోతను వినలేక మబ్బుచాటుకుపోయి దాక్కున్నాడు చంద్రుడు.

దూరాన ఏదో నక్కకూత అస్పష్టంగా వినిపించింది.

*

లోకం లక్ష్మి చావునుగురించి పరిపరి విధాలుగా చెప్పుకుంది. ఆ డొంకమీది చెట్లకీ ఆకాశాన మబ్బులవెలుపలనున్న రెండు చిన్న నక్షత్రాలకీ అచ్చయ్యకీ తప్ప ఇంకెవరికీ తెలియదు నిజం!

ఇది జరిగి నాలుగు సంవత్సరాలైంది. "లక్ష్మి" అన్న ఒక అభాగిని ఇప్పుడెవరికీ జ్ఞాపకం లేదు.

అచ్చయ్య చెక్కుచెదరకుండా అలానే ఉన్నాడు. ఇంకెందరు మానవతులజీవితాలను నాశనం చేయటానికో!


## "కథాంజలి"

(వార్షిక సంచిక)

●

జూన్ నెలలో వెలువడుతుంది

**52** పుటలు ఒకఅణామాత్రమే!

కథలు పంపువారు త్వరపడండి.

●

ప్రకటన రేట్లు:

| | |
|---|---|
| మొదటి రేపరు పేజీ మూడు రంగుల్లో | 40 రూ. |
| రెండో రేపరు | 30 ,, |
| మూడో రేపరు | 25 ,, |
| నాలుగో రేపరు మూడు రంగుల్లో | 35 ,, |
| లోపల ప్రతిఒక్క పేజీకి | 15 ,, |

వివరాలకు :

మేనేజరు :

"కథాంజలి"

32. కృష్ణప్పనాయక్ టాంక్స్ట్రీటు,

జి. టి. మద్రాసు.